సాక్షి
కాకినాడ

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదానానికి కొరుప్రోలు నాగ సూర్యకాంతం రూ.1,00116 విరాళం అందజేశారు.



మధురఫలం

రుచిలో సిమ్లా యాపిల్‌ని మరపించే చాగల్నాడు కస్టర్డ్ యాపిల్ (సీతాఫలం)కి జిల్లాలోనే కాదు దేశ రాజధాని ఢిల్లీలో కూడా మంచి పేరు ఉంది. - 8లో

1.62 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి మండల స్థాయి అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని మండల స్థాయి అధికారులకు సోమవారం నుంచి మూడురోజుల పాటు శిక్షణ ప్రారంభం అవుతుందని శిక్షణ కేంద్రం మేనేజరు పి. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతీ జిల్లా నుంచి ఇద్దరు ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరు అవుతారని తెలిపారు. పంచాయతీరాజ్ అధికారులు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందిన అధికారులు ఆయా జిల్లాలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు పంచాయతీరాజ్ వ్యవస్థపై శిక్షణ ఇవ్వలసి ఉంటుందన్నారు.

ఏలేరులో 21.70 టీఎంసీల నీటినిల్వలు



ఏలేరులో నీటినిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టులో ఆదివారం నాటికి 21.70 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో పడుతుండడంతో ప్రాజెక్టులో నీటినిల్వలు గణనీయంగా పెరిగాయి. జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 3,623 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 85.37 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 21.70 టీఎంసీలకు చేరుకున్నాయి. దీంతో ఆయకట్టుకు 1,600, విశాఖకు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

లోవలో భక్తుల సందడి

రూ.3.64 లక్షల ఆదాయం

తుని రూరల్: వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులతో తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో సందడి నెలకొంది. ఆదివారం ప్రత్యేక వాహనాల్లో వచ్చిన ఎనిమిది వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టికెట్లు, కాటేజీలు, వసతి గదులు, వాహన పూజలు, కేశఖండన టికెట్లు, విరాళాల ద్వారా రూ.3,64,167 ఆదాయం సమకూరినట్టు ఈఓ వివరించారు.

దేవస్థానం అధికారుల బదిలీ

అన్నవరం: రత్నగిరిపై సత్యనారాయణస్వామి దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న పి.విశ్వనాథరాజు పిఠాపురంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా బదిలీ అయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం ఈఓగా పని చేస్తున్న రామ్మోహనరావును అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. అరసవిల్లి దేవస్థానం ఈఓగా పని చేస్తున్న డీవీఎల్ రమేష్‌బాబును కాకినాడ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీ కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో జోన్-2లో సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు ఆదివారం ఏలూరులోని ఆ శాఖ డీఐజీ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రారంభమైంది. జోన్ పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల స్థాయిలో (కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి) జిల్లాలకు సంబంధించిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సీనియర్ అసిస్టెంట్ల బదిలీలకూ కౌన్సెలింగ్ చేపట్టారు. ఆదివారం రాత్రి 10 గంటల వరకూ సబ్ రిజిస్ట్రార్ల బదిలీల కౌన్సెలింగ్ కొనసాగుతూనే ఉంది. కాగా ఆయా జిల్లాలకు సంబంధించి మొత్తం 93 మంది సబ్ రిజిస్ట్రార్లు ఈ బదిలీల్లో స్థాన చలనం పొందనున్నారు. వీరితోపాటు సుమారు 120 మంది సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియకు ఏలూరు రేంజ్ డీఐజీ ఎస్.మాధవి చైర్‌పర్సన్‌గా వ్యవహరించగా కాకినాడ రేంజ్ డీఐజీ బి.శివరామ్, విజయవాడ రేంజ్ డీఐజీ ఎ.రవీంద్రనాథ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

27న పర్యాటకంపై పోటీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రపంచ పర్యాటక దినోత్సవం -2024 పురస్కరించుకుని పర్యాటక అంశంపై పోటీలను సెప్టెంబర్ 27న నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వక్తృత్వం, క్విజ్, ఒక నిమిషం వీడియో రీల్, ఫొటోగ్రఫీ కేటగిరి పోటీలు నిర్వహిస్తారు.

గడువు తరుముకొస్తున్నా..

- ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేయించడంలో విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం
- పరీక్ష పాసైతే రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు అందుకొనే అవకాశం
- విద్యార్థులకు అవగాహన కల్పించడంలో అలసత్వం
- ఈ నెల 24 వరకు దరఖాస్తుకు గడువు పొడిగింపు
- 21,000 మందికిగాను 3,234 మంది మాత్రమే దరఖాస్తు



పాఠశాలలో విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ): 'నోటిఫికేషన్ వచ్చిందా.. పత్రికా ప్రకటన ఇచ్చేశామా? తమ పని అయిపోయిందా... 'అనే ధోరణితో నిరుపేద విద్యార్థుల భవితవ్యానికి విద్యాశాఖ అధికారులు గండి కొట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏటా అందజేసే రూ.12 వేల స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించేలా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సిన తరుణంలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించారు. చొరవ తీసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన ప్రధానోపాధ్యాయులు సైతం వహించిన మౌనం... నిరుపేద విద్యార్థులకు శాపంగా మారింది. అవగాహన లేమితో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు చాలామంది విద్యార్థులు దూరమవుతున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక దన్నుగా..

నిరు పేద విద్యార్థుల చదువును మధ్యలోనే ఆపేయకుండా ఆర్థిక చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష నిర్వహిస్తారు. అదే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్). ఈ ఉపకార వేతనాన్ని 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్లు అందిస్తారు. ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.48 వేలు పొందవచ్చు. ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 6తో గడువు ముగిసింది. అయితే తిరిగి ఈ నెల 24వ తేదీ వరకు గడువు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఏడాది డిసెంబర్ 8న పరీక్ష ఉంటుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. దరఖాస్తు సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేదు. పరీక్ష రాసే సమయానికి అన్ని పత్రాలు సిద్ధం చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలి. దరఖాస్తులను సంబంధిత హెచ్ఎంల ద్వారా అప్లోడ్ చేయాల్సి ఉంటుంది.

అవగాహన కల్పించడంలో విఫలం

పేద విద్యార్థుల చదువులకు ఎంతో దోహదపడే ఈ పరీక్షపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పెద్దగా అవగాహన లేదు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా తీసుకుని వీలైనంత మందితో దరఖాస్తు చేయిస్తే ఎక్కువమంది విద్యార్థులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. జూలై రెండోవారంలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అంటే దాదాపు నెలన్నర దాటుతోంది. జిల్లాలో 21,000 మంది అర్హులైన విద్యార్థులుంటే ఇప్పటి వరకూ కేవలం 3,234 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తే అధికారులు, హెచ్ఎంలకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. ఇక కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికైనా అధికారులు మేలుకోకపోతే జిల్లా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు.

దరఖాస్తు చేయించాలని చెప్పాం



ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ప్రతి స్కూల్ నుంచి దరఖాస్తు చేయించాలని ఆదేశాలు జారీ చేశాం. ఈ అంశంలో ప్రధానోపాధ్యాయులే చొరవ తీసుకోవాలి. భాగస్వామ్యం లేని పాఠశాల హెచ్ఎంలపై చర్యలు తీసుకుంటాం. గడువులోపు అన్ని స్కూళ్ల నుంచి భాగస్వామ్యం కనిపించాలి.

- పిల్లి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి

చాలా ఉపయోగపడే పరీక్ష



ప్రతిభ గల పేద విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష చాలా ఉపయోగకరం. ఒక్కసారి అర్హత సాధిస్తే ఏటా రూ.12 వేలు చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకూ స్కాలర్ షిప్ అందుతుంది. ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి.

- వి.రాజశేఖర్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి

- **స్వామిని** దర్శించిన 30 వేల మంది
- **దేవస్థానం** ఆదాయం రూ.30 లక్షలు
- **ఆలయ** ప్రాకారంలో ఘనంగా రథోత్సవం



సత్యదేవుని రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, అధికారులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆదివారం వేలాదిగా విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సత్యదేవుని ఆలయంతో బాటు ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, విశ్రాంతి మంటపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

కన్నుల పండువగా సత్యదేవుని రథోత్సవం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఆదివారం స్వామివారి ఆలయ ప్రాకారంలో కన్నుల పండువగా జరిగింది. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. అనంతరం మేళతాళాల మధ్య ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల విగ్రహాలను పండితులు ప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు సుధీర్ పరిచారకులు పవన్ స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం ఆలయ ఏఈఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ ఐవీ రామారావు, కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో రథోత్సవాన్ని నిర్వహించారు. రూ.2,500 టిక్కెట్‌తో ఇద్దరు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానాజీని బర్తరఫ్ చేయాలి



ఎమ్మెల్యే నానాజీని జనసేన నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్న దళిత నేతలు

జగ్గంపేట: రంగరాయ మెడికల్ కాలేజీలో జనసేన పార్టీ నాయకులు ఆటలాడుకునేందుకు పర్మిషన్ తెచ్చుకోమని చెప్పినందుకు దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని తక్షణం బర్తరఫ్ చేయాలని జగ్గంపేటకు చెందిన దళిత నేతలు డిమాండ్ చేశారు. జగ్గంపేటలో ఆదివారం దళిత సంఘాల నేతలు ఐక్యతా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ డాక్టర్‌పై ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన మేనల్లుడు బన్నీ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీనిపై స్పందించి ఎమ్మెల్యే నానాజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్, బీఎస్పీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు,జై భీమ్ రావ్ భారత్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లూరి సత్యానందం, అంబేడ్కర్ వాది నీలపల్లి అప్పారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక



రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైన వెంకటదుర్గ, లక్ష్మీ సత్య ప్రసిద్ధి

సామర్లకోట: వచ్చే నెల 4వ తేదీ నుంచి రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు సామర్లకోట మండలం చంద్రంపాలెం- ఉప్పరగూడెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఆదివారం కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో దేశెట్టి వెంకటదుర్గ, మండపాక లక్ష్మీ సత్యప్రసిద్ధి ఎంపిక అయ్యారని పాఠశాల హెచ్ఎం బీఎస్ఆర్‌బీహెచ్ వీకె భాస్కరకుమార్, పీఈటీ కె.వీరబాబు తెలిపారు. వీరు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అక్టోబరు 4న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

బాబుకు పాలన చేతకాకే డైవర్షన్ రాజకీయం

- రాజకీయ లబ్ధి కోసమే తిరుపతి లడ్డూపై అనుచిత వ్యాఖ్యలు
- వేంకటేశ్వరస్వామి ప్రసాదంపై దుష్ప్రచారం తగదు
- ప్రజలకు ఇచ్చిన మాట తప్పడం వల్లే పవన్ ప్రాయశ్చిత దీక్ష
- వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గం కో ఆర్డినేటర్ తోట నరసింహం



విలేకరులతో మాట్లాడుతున్న నరసింహం

కిర్లంపూడి: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాకే చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గం కో ఆర్డినేటర్ తోట నరసింహం అన్నారు. వీరవరంలోని ఆయన స్వగృహంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇది మంచి ప్రభుత్వం పేరిట తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావేదిక కార్యక్రమాల్లో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను డైవర్షన్ చేయడానికే వేంకటేశ్వరస్వామి ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితో విజయవాడలోని కృష్ణలంక గ్రామం నీటి ముంపునకు గురవకుండా ప్రొటెక్షన్ వాల్ నిర్మించి ప్రజలను కాపాడారన్నారు. తల్లికి వందనం పేరిట ఒక ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్నా రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఎవరికైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రతి మహిళకు ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అన్నారు. ఎవరికి ఇచ్చారు? ఇలా మీరిచ్చిన సూపర్ సిక్స్‌లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేనప్పుడు ఏ విధంగా ఇది మంచి ప్రభుత్వం అని ప్రశ్నించారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. నిందలు వేసిన వారికి స్వయంగా ఆ స్వామి వారే గుణపాఠం చెప్తారని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 11 రోజుల ప్రాయశ్చిత దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజులు గడిచినా నెరవేర్చలేకపోయారనే ఉద్దేశంతో ఈ దీక్ష చేస్తున్నారేమో అన్నారు. యువనాయకుడు తోట రాంజీ, తోట బాబ్జీ, తోట అయ్యన్న, అడబాల సుబ్బారాయుడు, చెలగల దొరబాబు పాల్గొన్నారు.

అయినవిల్లిలో భక్తుల సందడి



పుష్పాలంకరణలో విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేల్కొలుపు సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 64 మంది, లక్ష్మీగణపతి హోమంలో 28 మంది భక్తులు పాల్గొన్నారు. 25 మంది తమ నూతన వాహన పూజలు చేయించుకున్నారు. 2030 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.3,46,000 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ, ఏసీ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

రసాభాసగా శెట్టిబలిజ సంఘ సమావేశం

- ఒక వర్గానికి వత్తాసు పలికిన సీఐ అశోక్
- సంఘ సమావేశంలో బెదిరింపులు
- తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఎంపీ బోస్



శెట్టిబలిజ సంఘ సమావేశంలో సభ్యుల మధ్యలోనే పోలీసుల మోహరింపు

రామచంద్రపురం: దాదాపుగా 40 ఏళ్ల చరిత్ర కలిగిన రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం సర్వ సభ్య సమావేశం పోలీసులు ఓవర్ యాక్షన్‌తో రసాభాసగా మారింది. ఎప్పుడూ లేని విధంగా తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశానికి భారీగా పోలీసులు మోహరించటం ఆశ్చర్యానికి గురి చేసింది. సంఘం నూతన అధ్యక్షుడిని ఎన్నుకునే విషయంలో వచ్చిన తగాదా గత రెండు నెలలుగా వివాదంగా మారింది. సమస్యను పరిష్కరించేందుకు రాజ్యసభ సభ్యుడు, సంఘం గౌరవాధ్యక్షుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సంఘం సర్వ సభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో గొడవలు జరుగుతాయని పుకార్లు సృష్టించి అధికార పార్టీకి చెందిన కొంత మంది పోలీసులను భారీగా మోహరింపచేశారు. దీంతో రామచంద్రపురం పట్టణంలోని ద్రాక్షారామ రోడ్డు పోలీసులతో నిండిపోయి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వివరాల్లోకి వెళితే తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించకుండా టీడీపీకి చెందిన దొంగల శ్రీధర్, మరికొంత మంది తమకు అనుకూలంగా ఉన్న శెట్టిబలిజ నాయకులతో కలసి తనే తాలూకా శెట్టిబలిజ సంఘం నేతగా శ్రీధర్ ప్రకటించుకున్నారు. దీంతో మాజీ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ మరికొంత మంది సీనియర్ శెట్టిబలిజ సంఘం నేతలు వ్యతిరేకించారు. ఈ గొడవ సద్దు మణిగే విధంగా చేసేందుకు ఎంపీ బోస్ శెట్టిబలిజ సంఘ భవనంలో ఆదివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి సమావేశం ఏర్పాటు చేసుకోగా అంతకు ముందుగానే రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ కె.అశోక్‌కుమార్ సారథ్యంలో ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్సైలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, క్విక్ యాక్షన్ టీం, ఇతర పోలీస్ సిబ్బంది రెండు బస్సుల్లో సుమారు వంద మందికి పైగా పోలీసులు మోహరించారు. సంఘం భవనంలోకి ముందుగా ఎవరినీ వెళ్లనివ్వలేదు. భారీగా పోలీసులను మోహరించడంతో కనీసం సంఘం సమావేశంలో తమ సమస్యలను చెప్పుకునేందుకు కూడా పోలీసులు వీలు కల్పించకుండా చేశారని సీఐ అశోక్‌కుమార్ బెదిరించడాన్ని శెట్టిబలిజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం నిర్వహిస్తున్న సమయంలో రెండు వర్గాలను సముదాయించేందుకు సీఐ మైక్ తీసుకుని అందరిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడికి వచ్చిన సంఘ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గత నెల 18న నిర్వహించిన సమావేశం కూడా సీఐ, పోలీసుల ఓవర్ యాక్షన్ మూలంగానే వాయిదా పడగా ఆదివారం సమావేశం కూడా సజావుగా జరగకుండా చేశారని సంఘ పెద్దలు అసహనం వ్యక్తం చేశారు. రసాభాసగా మారుతున్న తరుణంలో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీ బోస్ ప్రకటించారు.

మంచి కాదు.. ముంచిన ప్రభుత్వం

- చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్
- వంద రోజుల్లో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు
- చంద్రబాబు తప్పు చేశారని పవన్ కల్యాణ్ ఒప్పుకున్నారు..
- అందుకే ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారా?
- భక్తుల మనోభావాలపై చంద్రబాబు అభాండాలు వేయడం దారుణం
- ఉద్యోగులను భయానికి గురి చేస్తున్నారు
- ముగ్గురు ఐపీఎస్‌లను అన్యాయంగా సస్పెండ్ చేశారు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణు

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా నేతలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల వద్దకు వెళుతున్నారని.. ప్రజలు మాత్రం మంచి కాదు.. ముంచిన ప్రభుత్వం అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్‌లో ఒక్క పథకం కూడా ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. ఎక్కడ పథకాలు అమలు చేయాల్సి వస్తోందోనన్న ఉద్దేశంతో ఖజానా ఖాళీగా ఉంది, నాకు భయమేస్తోందన్న డ్రామాకు చంద్రబాబు తెర తీశారన్నారు. సీఎం ఎందుకు భయపడాలని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి రూ.14 లక్షల కోట్ల అప్పులున్నాయని బురదజల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తీరా చేస్తే రూ.7 లక్షల కోట్లే అప్పుందన్నారు. పథకాల అమలు నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు రోజుకో అంశంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. బుడమేరు ఉధృతితో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయలేదన్నారు. వాటి నుంచి బయటపడేందుకు ప్రకాశం బ్యారేజీ కూల్చేందుకు బోట్లు వదిలారన్న డ్రామాకు తెర తీశారన్నారు. వంద రోజుల పాలనలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై కేసులు పెట్టారు. ఉద్యోగులను భయానికి గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులను అన్యాయంగా సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. కాకినాడలో జనసేన ఎమ్మెల్యే సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించారన్నారు. దాడి చేసి రాజీ చేసుకుంటే చట్టాలపై ప్రజలకు ఉన్న సమ్మకం పోదా? అని ప్రశ్నించారు.

పవన్ దీక్ష ఎందుకో?

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎందుకోసం దీక్ష చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. తిరుమల స్వామి వారి విషయంలో సీఎం చంద్రబాబు చేసిన అపరాధాన్ని క్షమించమని పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారన్నారు. తప్పు చేసిన వారే ప్రాయశ్చిత్త దీక్ష చేస్తారన్నారు. బీజేపీ ప్రభుత్వం అయోధ్య విషయంలో తిరుమలను మోడల్‌గా తీసుకోమనడం నిజం కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు స్వామివారి పవిత్రతను గతంలో ఎన్నడూ లేనివిధంగా దెబ్బతీశారన్నారు. రాజకీయ లబ్ధి కోసం పవిత్రమైన పుణ్యస్థలాన్ని వాడుకోవడం సిగ్గుచేటన్నారు. వినియోగించని నెయ్యి కల్తీ అయిందని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రతి రాజకీయ అడుగులో కుట్రకోణం దాగుంటుందని గుర్తుచేశారు. టీటీడీ నిర్వహణలో సీఎం పాత్ర ఉండదని స్వయానా లోకేశ్ స్పష్టం చేశారని, అలాంటప్పుడు మాజీ ముఖ్యమంత్రి పాత్ర ఎలా ఉంటుందని ప్రశ్నించారు. తిరుమలలో ప్రస్తుత ఈఓ ఏ పని చేస్తున్నారో గత ప్రభుత్వంలో ఈఓలూ అదే పని చేసేవారని గుర్తుచేశారు. గతంలో నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో 18 సార్లు లడ్డూ తయారీ సామగ్రిని రిజెక్ట్ చేసిన సందర్భాలున్నాయన్నారు. లడ్డూ కల్తీపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. తిరస్కరించినట్లుగా చూపిన నేతిని లడ్డూ తయారీలో ఉపయోగించారని ప్రతిపక్షంపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు.

ఇసుక దోపిడీ

కూటమి నేతలు ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు క్యూబిక్ మీటర్ల ఇసుక రూ.17 వేలుంటే ప్రస్తుతం 5 క్యూబిక్ మీటర్ల ఇసుక రూ.45,000 పలుకుతోందన్నారు. నిల్వ ఉంచిన ఇసుకను దొంగిలించిన కూటమి నేతలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు భాగేష్ చైతన్య



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన భాగేష్ చైతన్య, కోచ్ త్రిమూర్తులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు శ్రీనివాస తైక్వాండో క్రీడాకారుడు అప్పారి భాగేష్ చైతన్య ఎంపికై నట్లు కోనసీమ జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, సీనియర్ కోచ్ పి.త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో చైతన్యను పలువురు క్రీడాకారులు ఆదివారం అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ నెల 21న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–19 తైక్వాండో పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో భాగేష్ చైతన్య ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. దాంతో అతడు రైల్వేకోడూరులో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనున్నాడన్నారు. భాగేష్ చైతన్యను ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, హెచ్ఎం కె.సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి, పీఎంసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

స్వగ్రామానికి చేరిన యువకుడి మృతదేహం

నిడదవోలు రూరల్: ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరింది. స్థానికుల వివరాల ప్రకారం నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామానికి చెందిన అవిటి రాజు (25) జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం మస్కట్ వెళ్లాడు. ఈనెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు మృతి చెందాడు. దీంతో యువకుడి మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్: అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఎలుగు గోవింద్ (36) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. తేటగుంట గ్రామానికి చెందిన గోవిందు శనివారం విధులు ముగించుకుని తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో ఉంటున్న అత్తారింటికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై రాత్రి స్వగ్రామం వస్తుండగా మూసివేసిన ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొందన్నారు. 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారన్నారు. పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు ఆదివారం అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన దూడల సతీష్ (32) కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కరప పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 16న సతీష్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సతీష్ ఆదివారం మృతి చెందాడు. దాంతో మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి తెలిపారు.

మధుర ఫలం



జాతీయ రహదారిపై జరుగుతున్న సీతాఫలాల విక్రయాలు

- జోరుగా సీతాఫలాల వ్యాపారం
- సీజన్‌లో రూ.ఏడున్నర కోట్ల లావాదేవీలు
- రియల్‌ఎస్టేట్ దెబ్బకు చాగల్నాడులో అంతరిస్తున్న తోటలు

రాజానగరం: రుచిలో సిమ్లా యాపిల్‌ని మరపించే చాగల్నాడు కస్టర్డ్ యాపిల్ (సీతాఫలం)కి జిల్లాలోనే కాదు దేశ రాజధాని ఢిల్లీలో కూడా మంచి పేరు ఉంది. అయితే చాగల్నాడు ప్రాంతంలో రియలెస్టేట్ విస్తరిస్తున్న నేపథ్యంలో సీతాఫలాల తోటలు అంతరించి పోతున్నాయి. ఫలితంగా చాగల్నాడు సీతాఫలాలకు డిమాండ్ పెరిగి ధర కూడా పెరిగిపోయింది. చాగల్నాడు ప్రాంతంలో తోటలు (మామిడి, జీడి మామిడితో కలసి ఉంటాయి) తరిగిపోవడంతో సీతాఫలాల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. సీతాఫలాలు పక్వానికి రావాలంటే శీతలంతో పాటు వర్షాలు కురుస్తూ ఉండాలి. ఈ కారణంగానే ప్రస్తుతం ఈ ప్రాంతంలో అక్కడక్కడా లభిస్తున్న సీతాఫలాలతో ఏజెన్సీ ప్రాంతంలో విరివిగా దొరుకుతున్న సీతాఫలాలను జోడించి వ్యాపారులు స్థానికంగా విక్రయిస్తున్నారు. ఇక్కడ నుంచే జిల్లాలోని పలు ప్రాంతాలకు కూడా రవాణా అవుతున్నాయి. ఈ విధంగా సీజన్‌లో సీతాఫలాలు క్రయవిక్రయాల ద్వారా సుమారు రూ.7.5 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతాయని అంచనా.

గుర్తించడం చాలా కష్టం

రెండు దశాబ్దాల క్రితం జాతీయ రహదారి విస్తరణకు ముందు ఈ ప్రాంతంలో రోడ్లకు ఇరువైపులా సీతాఫలాల తోటలు విస్తారంగా ఉండేవి. రాత్రి సమయాల్లో బస్సుల్లో ప్రయాణించే వారికి లైటింగ్‌లో సీతాఫలాలు నిగనిగలాడుతూ కనిపించేవి. అంతేకాదు సీజన్‌లో దివాన్‌చెరువు కూడలి క్రయ, విక్రయదారులతో కిక్కిరిసిపోయేది. ఒక్కో సమయంలో ట్రాఫిక్ జామ్ కూడా జరుగుతూ ఉండేది. అయితే నేడు ఆ పరిస్థితులు లేవు. మార్కెట్‌లో ప్రస్తుతం లభిస్తున్న సీతాఫలాలు చాగల్నాడు ఫలాలో, ఏజెన్సీవో కూడా తెలియని పరిస్థితి. వీటి మధ్య ఉన్న తేడా స్థానికులకే మాత్రమే కొంత అవగాహన ఉంటుంది. దీంతో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా ప్రయాణికులు చాగల్నాడు ఫలాలుగానే భావించి కొనుగోలు చేసుకుని, తమ ప్రాంతాలకు తీసుకెళుతుంటారు.

ఎందరికో ఉపాధి

సీతాఫలాల ద్వారా సీజన్‌లో ఎందరికో జీవనోపాధి లభిస్తుంటుంది. రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారి వెంబడి విరివిగా వెలసిన దుకాణాలతో పాటు సైకిళ్ల పైన, తోపుడు బళ్లపైన జిల్లా అంతటా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు కొనుగోలు చేస్తున్నారు. చాగల్నాడు సీతాఫలాలు నిల్వకు ఆగవు. పక్వానికి వచ్చిన వెంటనే కళ్లు విచ్చుకున్నట్టుగా నిగనిగలాడుతూ కనిపిస్తాయి. అయితే ఏజెన్సీ సీతాఫలాలు వారం రోజుల వరకు నిల్వ ఉంటాయి. ఈ సీజన్‌లో సీతాఫలాల వ్యాపారం రూ.ఏడున్నర కోట్లు దాటుతుందని ఒక అంచనా. జూలై నుంచి అక్టోబరు వరకు ఏజెన్సీ సీతాఫలాలను దిగుమతి చేసుకుని, రూ.4.50 కోట్లకు పైబడి వ్యాపారం చేస్తుంటారు. ఇక తోటలు తగ్గినాగాని చాగల్నాడు సీతాఫలాల ద్వారా ఈ సీజన్‌లో (అక్టోబరు) రూ.రెండు కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వ్యాపారులు అంటున్నారు. ఏ విధంగా చూసిన ఈ సీజన్‌లో సీతాఫలాల ద్వారా జిల్లాలో రూ.ఏడున్నర కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని అంచనా.

వంద ఫలాలు రూ.2,500 పైమాటే..



తోటలు విస్తారంగా ఉన్న సమయంలో వంద సీతాఫలాలను రూ.50 నుంచి రూ.వందకు విక్రయించే వారు. కానీ నేడు ఆ ధరకు అడిగితే ఎగాదిగా చూస్తారు. ఎందుకంటే వందల లెక్కన కొనుగోలు చేసే రోజులు పోయాయి. మామిడి పండ్ల మాదిరిగా డజను, పాతిక, పరక చొప్పున కొనాల్సి వస్తుంది. గతంలో మాదిరిగా వంద ఫలాలు కొనాలంటే రూ.2500 పైనే ధర పలుకుతుంది. అంత మొత్తం పెట్టలేక చాలామంది డజన్ల లెక్కన కొనుగోలు చేస్తున్నారు. కాయల సైజులను బట్టి పరక, డజను లెక్కల్లో డజను రూ.300 నుండి రూ.500కు విక్రయిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి వీటిని కొంతమంది స్థానిక వ్యాపారులు హోల్‌సేల్‌గా తీసుకువచ్చి, జాతీయ రహదారి వెంబడి ఉన్న స్టాల్స్‌కి సరఫరా చేస్తుంటారు.

అక్టోబర్ చివర్లో షోలాపూర్ ఫలాలు..

ఇదిలా ఉండగా దసరా ఉత్సవాల సమయంలో చాగల్నాడు సీతాఫలాలు అందుబాటులోకి వస్తాయి. అయితే తోటలు తక్కువగా ఉండటంతో అవి ఎప్పుడు వచ్చాయి. ఎప్పుడు అయిపోయాయనే విషయం కూడా తెలియకుండా జరిగిపోతుంటుంది. దీంతో ఈ సీజన్ ప్రారంభంతో ఏజెన్సీ సీతాఫలాలను చాగల్నాడు మార్కెట్‌కి వస్తే, ఆఖరులో (అక్టోబరు, నవంబరు) వ్యాపారులు షోలాపూర్ నుంచి కూడా సీతాఫలాలను దిగుమతి చేసుకుని తమ వ్యాపారాలు కొనసాగిస్తుంటారు. ఇవి చూడటానికి చాగల్నాడు సీతాఫలాల మాదిరిగానే నిగనిగలాడుతూ కనిపిస్తుంటాయి. దీంతో ఈ సీజన్‌లో షోలాపూర్ కాయల ద్వారా సుమారు రూ.కోటి వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతాయని ఒక అంచనా. దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌కి షోలాపూర్ నుంచి వచ్చే యాపిల్, దానిమ్మల లోడులో వీటిని తీసుకువస్తుంటారు.

సీజన్‌లో దొరికే ఫలాలను తినాలి



సీజన్‌లో దొరికే ఫలాలను తినడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయి. ప్రకృతి మనకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు ఫలాలను ప్రసాదిస్తుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో సీతాఫలాలను తీసుకోవడం వలన ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలను పొందవచ్చు. అందుకనే వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది.

– అద్దంకి సీతారామమ్మ, అచ్యుతాపురం

సీజనల్ పండ్లని నిర్లక్ష్యం చేయవద్దు



నేటి ఆధునిక సమాజంలో అంతా రెడీమేడ్ ఫుడ్‌కు అలవాటు పడటం వలన జనం జబ్బుల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల్లో చేరి, పండ్లు తిని నయం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సీజనల్‌గా దొరికే పండ్లని ఒక్కసారైనా తింటే సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి కొంతమేర తప్పించుకోవచ్చు.

– సత్తి త్రిమూర్తులు, ముక్కినాడపాకలు

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపికలు

ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో 400 మంది హాజరు



హై జంప్ చేస్తున్న క్రీడాకారిణి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపికలకు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అండర్–14, 16, 18, 20 బాలురు, బాలికల విభాగాల్లో జరిగిన ఎంపికలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 400 మంది హాజరయ్యారు. అథ్లెటిక్స్‌లో వివిధ పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు అక్టోబర్ 4, 5, 6 లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందని అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ఎంపికల నిర్వహణలో అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, కోచ్ ప్రసాద్ రెడ్డి, పీడీలు రవిరాజు, గిరి, రాజు, వీరబాబు, నూకరాజు పాల్గొన్నారు.

గ్రేడ్–2 ఏపీపీల బదిలీలు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) గ్రేడ్–2కు బదిలీలు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న ఏపీపీ గ్రేడ్–2 కె.రాధాకృష్ణను బదిలీపై రాజమహేంద్రవరం ఒకటో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు నియమించారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం ఒకటో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న ఏపీపీ గ్రేడ్–2 జీవీ రత్నంబాబును కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టుకు నియమించారు. అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో పని చేస్తున్న ఏపీపీ గ్రేడ్–2 కె.వెంకటలక్ష్మిని బదిలీపై ఏలూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు నియమించారు. ఆమె స్థానంలో విజయనగరం అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో పనిచేస్తున్న ఏపీపీ గ్రేడ్–2 డి.శ్రీనివాస పట్నాయక్‌ను నియమించారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)లను బదిలీలు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న సీహెచ్ జగదీష్‌ను బదిలీపై ముమ్మిడివరం జేఎఫ్‌సీఎం కోర్టుకు ఏపీపీగా నియమించారు. ఆయన స్థానంలో ముమ్మిడివరం జేఎఫ్‌సీఎం కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న ఎన్.ఎస్.రాధికను నియమించారు. తుని జేఎఫ్‌సీఎం కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న ఎన్.సునీతను బదిలీపై అమలాపురం జేఎఫ్‌సీఎం కోర్టుకు నియమించారు. ఆమె స్థానంలో రాజమహేంద్రవరం మూడో జేఎఫ్‌సీఎం కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న కేఎస్ఎస్ లక్ష్మీదేవిని నియమించారు. అమలాపురం జేఎఫ్‌సీఎం కోర్టుకు ఏపీపీగా పనిచేస్తున్న సీహెచ్ రాజశేఖర్‌ను బదిలీపై రాజమహేంద్రవరం మూడో జేఎఫ్‌సీఎం కోర్టుకు నియమించారు.

ముగిసిన క్లస్టర్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విజయ్‌ప్రకాష్ తదితరులు

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో టీటీ అసోసియేషన్ సెక్రటరీ కె.మోహన్‌బాబు, ఉపాధ్యక్షుడు దంటు భాస్కర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఒలింపిక్స్‌కు టేబుల్ టెన్నిస్ అకాడమీ నుంచి క్రీడాకారులు ఎంపిక కావాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన శ్రీప్రకాష్ టీటీ అకాడమీ నుంచి నాణ్యమైన క్రీడాకారులను తయారు చేయాలన్నారు. విజయ్‌ప్రకాష్, హైదరాబాద్ టీటీ ఇంటర్నేషనల్ కోచ్ సురేష్ మాట్లాడుతూ క్రీడాకారులకు నిత్య సాధన అవసరమన్నారు. అనంతరం విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతీ ప్రదానం చేశారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీ సీహెచ్ సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, రిఫరీలు రమణ కుమార్, వేణుగోపాల్, ఆయా సెక్టార్ల నుంచి ఉభయ రాష్ట్రాలకు చెందిన సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్

రూ.3 లక్షల సొత్తు రికవరీ



స్వాధీనం చేసుకున్న సొత్తు, అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

యానాం: యానాం పట్టణ శివారు దొమ్మేటిపేటలో చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి సొత్తు రికవరీ చేసినట్టు ఎస్పీ రాజశేఖరన్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఈ ఘటనకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. దొమ్మేటిపేటలో మూసి ఉన్న రాయల్ రిక్రియేషన్ క్లబ్‌లోకి ఇటీవల వెంటపల్లి శ్రీను, మావిడి సందీప్ మరో ఇద్దరు మొత్తం నలుగురు చొరబడ్డారు. అందులో ఉన్న రూ.లక్షల విలువైన 6 ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు, వంట, షామ్యానా సామగ్రి తదితర సుమారు రూ.3 లక్షల విలువైన 41 రకాల వస్తువులను చోరీ చేశారు. దీనిపై క్లబ్ యజమాని బి.శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు యానాం క్రైమ్ టీం సభ్యులు నిందితుల్లో ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసి సబ్ కోర్టుకు హాజరు పరిచారు. వారికి 14 రోజుల పాటు జడ్జి రిమాండ్ విధించారన్నారు. పరారైన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐ షణ్ముగం, ఎస్సై మురుగానందన్, క్రైమ్ టీం పోలీసులు పాల్గొన్నారు.

టైరు పేలి లారీని ఢీకొట్టిన వ్యాన్



ప్రత్తిపాడులో డివైడర్‌పైకి దూసుకుపోయి లారీని ఢీకొట్టిన వ్యాన్

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్థానిక శ్రీపాదాలమ్మ వారి ఆలయం సమీపాన జరిగిన ప్రమాదంలో పెద్ద ముప్పు తప్పింది. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ఆదివారం రాజమహేంద్రవరం వెళ్తున్న వ్యాన్ ముందు టైర్ పంక్చర్ కావడంతో డివైడర్ పైకి దూసుకుపోయి, రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో భీమవరానికి చెందిన లారీ డ్రైవర్ మంతెన సాయిశివ (35) తీవ్రంగా గాయపడడంతో కాకినాడలోని ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో హైవేపై ట్రాఫిక్ తక్కువగా ఉండడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.

అక్టోబర్ 3 నుంచి పీఠంలో దసరా ఉత్సవాలు



పీఠాధిపతి గాడ్ సమక్షంలో శరన్నవరాత్రుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు తదితరులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో 53వ శరన్నవరాత్ర ఉత్సవాలను వచ్చే నెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) ఆదివారం విలేకరులకు తెలిపారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) సమక్షంలో శరన్నవరాత్రులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి హస్త నక్షత్రంలో ఉదయం 8.19 గంటలకు అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశస్థాపనతో కార్యక్రమాలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. వచ్చే నెల 3న విజయదుర్గా అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న బాలాత్రిపురసుందరీదేవి, 7న రజత కవచ విజయ దుర్గాదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దని అవతారంలో అలంకరించనున్నట్లు వారు తెలిపారు. 12న రాజరాజేశ్వరీదేవి అవతారంలో విజయదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని రోజూ పీఠంలో పలు రకాల పూజలు నిర్వహిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ చెకప్ అని వెళితే ప్రాణాలు పోయాయి..

లబ్బీపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన



విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య మజ్జి సుజాత, ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): 'మా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం పెడితే పరీక్ష చేయించుకోవడానికి మా నాన్న వెళ్లాడు. అక్కడ ఈసీజీ తీసి కొద్దిగా తేడా ఉంది. విజయవాడ వస్తే ఫ్రీ చెకప్ చేస్తామన్నారు. వారి మాటలు నమ్మి వస్తే ఇక్కడ ప్రాణాలే పోయాయంటూ' మృతుడి కొడుకు సతీష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం..

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం కవులూరులో లబ్బీపేటలోని ఓ గుండె జబ్బుల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీంతో అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మజ్జి పాపయ్య పరీక్షలు చేయించుకునేందుకు శిబిరానికి వెళ్లారు. ఈసీజీ తీసి కొద్దిగా తేడా ఉంది, విజయవాడ వస్తే ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు చేస్తామని చెప్పడంతో గురువారం విజయవాడ వచ్చి ఆస్పత్రిలో చేరాడు. అతనికి శుక్రవారం ఆరోగ్యశ్రీ పథకంలో యాంజియోగ్రామ్ చేసి, ఒక రక్తనాళంలో పూడిక ఉంది, అప్రూవల్ పెట్టి స్టంట్ వేద్దామని వైద్యులు చెప్పినట్లు పాపయ్య కుమారుడు సతీష్ తెలిపారు.

కాగా ఆదివారం మధ్యాహ్నం యాంజియోగ్రామ్ చేసిన చోట కొద్దిగా నొప్పి వస్తుందని చెప్పడంతో వార్డులో విధులు నిర్వహించే ట్రైనింగ్ సిస్టర్స్ పెయిన్ ఇంజక్షన్ చేశారని, పది నిమిషాలకే ఫిట్స్ వచ్చి వాంతులు చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ఐసీయూకు తీసుకెళ్లి సీపీఆర్ చేశారని, కానీ అప్పటికే ప్రాణాలు విడిచినట్లు పేర్కొన్నారు. తాము అడ్మిట్ అయిన రోజే పెయిన్ కిల్లర్ పడవని చెప్పగా, వారు రికార్డు చేసుకున్నట్లు తెలిపారు. కానీ శిక్షణ పొందుతున్న వారు కేస్‌షీట్ చూడకుండా ఇంజక్షన్ చేయడంతో ఇన్‌ఫెక్షన్ వచ్చి ప్రాణాలు విడిచాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత పరీక్షలంటే వచ్చామని, ఇక్కడకు వస్తే ప్రాణాలే తీశారంటూ కన్నీరు మున్నీరయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలోని వైద్యుల నిర్లక్ష్యంపై కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గణేశ్ ఊరేగింపులో యువకుడికి గాయాలు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపాన బేతాళస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహ నిమజ్జనంలో ఆదివారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది. బేతాళ స్వామి ఆలయం నుంచి నిమజ్జన ఊరేగింపు వెళుతున్న సమయంలో యువకులు అరుపులు, కేరింతలు పెడుతున్నారు. ఈ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దాంతో కాకినాడ నుంచి వచ్చిన యువకుడు సన్ని (23) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు ఫ్లెక్స్ షాపులో పని చేస్తాడని స్థానికులు తెలిపారు. గుర్తు తెలియని యువకుడు సన్నీ మెడపై దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వెంటనే సన్నీని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో ఎస్సై మూర్తి సంఘటన ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఎస్సీలను రాచి రంపాన పెట్టడం ఆయనకు ఇష్టం

- చంద్రబాబు ఓ దుర్మార్గుడు
- మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ధ్వజం
- గణేశ్ నిమజ్జనం అల్లర్లలో దెబ్బతిన్న దళితులకు పరామర్శ



కొవ్వూరులోని శ్రీరామా కాలనీ బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్

కొవ్వూరు: పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం సందర్భంగా స్థానిక శ్రీరామా కాలనీ, రాజీవ్ కాలనీ యువకుల మధ్య అల్లర్లు తలెత్తడంతో ఆదివారం కూడా పోలీసు పికెట్లు కొనసాగుతున్నాయి. కాగా మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆదివారం రాత్రి అల్లర్లలో దెబ్బతిన్న శ్రీరామా కాలనీ వాసులను పరామర్శించారు. వారి ఇళ్లను, దెబ్బతిన్న వారి వాహనాలను పరిశీలించి, అల్లర్లకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మనల్ని (దళితులను) సముదాయిస్తున్నారు. అవతలి వాళ్లు వచ్చి కొట్టేస్తున్నారు. పోలీసు పికెట్స్ ఏర్పాటు చేసి మనకు ప్రయోజనం ఏంటి' అని ప్రశ్నించారు. 'ప్రభుత్వం మనల్ని కొట్టే వారి ప్రాణాలను రక్షించేందుకు, వారిపై తిరగబడకుండా కాపాడుతున్నా'రన్నారు. 'మమ్మల్నే తొక్కిపెట్టి అవతలి వాళ్లను ఫ్రీగా వదిలి పెడితే ఊరుకునేది లేదు. ప్రభుత్వానికి కూడా హెచ్చరిక చేస్తున్నాం. పది రోజుల్లో కేసులు పెట్టి వాళ్లను అరెస్ట్ చేయకపోతే ఉద్యమిస్తాం' అంటూ హెచ్చరించారు. ఓటు వేయించుకున్న వాళ్లు గాని, మరే పార్టీ వాళ్లు గాని శ్రీరామా కాలనీకి రాకపోవడాన్ని హర్షకుమార్ తప్పుబట్టారు. పోలీసులు తమ వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. ఎస్సీ వాళ్లు ఎక్కడ దొరికితే అక్కడ కొట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. 'చంద్రబాబు అన్న వాడు చాలా దుర్మార్గుడు. వాడి కళ్లే విషపు కళ్లు. ఎస్సీలను తొక్కిపెట్టేసి రాచి రంపాన పెట్టేయాలనేదే వాడి ఉద్దేశమని' హర్షకుమార్ అన్నారు. మాల మహాసభ జాతీయ కన్వీనర్ బొంతా శ్యాం రవి కుమార్, మాసా ఆనంద్, నేతల వెంకటేష్, బొండాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.